క్లుప్తంగా

శ్రీరాముని చెంత ఏకాహం



రామాలయంలో ఏకాహం భజన చేస్తున్న భక్తులు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెం సీతారామాలయంలో శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఏకాహం చేశారు. సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి భజనలు ప్రారంభించారు. నిరంతరాయంగా 24 గంటల పాటు ఆదివారం రాత్రి వరకు శ్రీరామ కీర్తనలతో భజనలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు భజనల్లో పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న బొత్స దంపతులు



సింహగిరిపై బొత్స ఝాన్సీలక్ష్మి, సత్యనారాయణ దంపతులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఆమె భర్త, మంత్రి బొత్స సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

19 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: అక్రమంగా తరలిస్తున్న 19 మద్యం సీసాలను పరవాడ ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల సోములు వాడచీపురుపల్లిలోని మద్యం దుకాణం నుంచి 19 మద్యం(180ఎంఎల్) సీసాలను కొనుగోలు చేసి, తీసుకెళ్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సోములుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దొంగలున్నారు జాగ్రత్త

ఆరిలోవ: కాలనీల్లో దొంగలు తిరుగుతున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని క్రైం డీసీపీ వెంకటరత్నం హెచ్చరించారు. జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో ఆదివారం సాయంత్రం ద్వారకా క్రైం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టపగలే కొందరు అపరిచిత మహిళలు ఏదో అవసరం కోసం వచ్చి ఇళ్లలో చొరబడుతున్నారని తెలిపారు. కారులో భార్యభర్తలుగా చెప్పుకుంటూ వస్తున్నారని, వారిలో మహిళలు మాత్రం వీధులు, అపార్ట్‌మెంట్లలో ఇళ్లకు వెళ్లి అనాథ శరణాలయం నుంచి వచ్చామని, సహాయం చేయాలని అడుగుతున్నారన్నారు. ఇలా తాళాలు వేసి ఉండే ఇళ్లు పరిశీలించడం, ఒంటరిగా ఉన్న మహిళల మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేయడం చేస్తున్నారని చెప్పారు. ఇటీవల సాగర్‌నగర్, డెయిరీ ఫారం వద్ద వెటర్నరీ కాలనీలో ఇలాంటి దొంగతనాలు జరిగినట్లు వివరించారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరించి వాకింగ్‌కు వెళ్లవద్దన్నారు. ఊరు వెళ్లేటప్పుడు ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని, పోలీసులకు కూడా సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. కాలనీల్లో సంఘాల నాయకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనచోదకులు తమ వాహనాలకు హ్యాండిల్ లాక్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. అపరిచితులు కనిపించినా, అనుమానాస్పదంగా తిరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకా జోన్ ఏసీపీ వెంకటరావు, సీఐ శ్రీనివాసరావు, ఆరిలోవ క్రైం ఎస్‌ఐ మురళీకృష్ణ, రామకృష్ణాపురం గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు, స్థానికులు కాకర గోవింద్, మహిళలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సుధారాణి కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధికి తెలంగాణకు చెందిన చల్లా సుధారాణి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు టి. తిరుపతికి ఆదివారం విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు.

మీతోనే ఉంటా.. సేవలందిస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్



వేపగుంట నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా పెందుర్తి వరకు వేలాది బైక్‌లతో కార్యకర్తల ర్యాలీ

- మరోసారి అవకాశం ఇవ్వండి
- పెందుర్తి ప్రజలకు ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ వినతి
- వేపగుంట నుంచి పెందుర్తి వరకు భారీ బైక్ ర్యాలీ
- వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

పెందుర్తి: 'నేను స్థానికుడిని.. నిరంతరం మీకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తాను.. మరోసారి అవకాశం ఇవ్వండి'అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విన్నవించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెందుర్తి అభ్యర్థిగా మరోసారి అవకాశం ఇచ్చిన నేపథ్యంలో అదీప్‌రాజ్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి అదీప్‌రాజ్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే తనకు కొండంత అండ అని అన్నారు. తన పనితీరుపై నమ్మకం ఉంచి తనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గడపతోనూ తనకు పదేళ్లుగా ఎంతో అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గంలోని తన అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, అన్నదమ్ముల కష్టసుఖాలు తనకు తెలుసని.. గత ఐదేళ్లలో చాలా వరకు సమస్యలు పరిష్కరించామన్నారు. తనకు మరోసారి మద్దతుగా నిలిస్తే వెనువెంటనే మిగతా సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అక్రమ మార్గాలు, అబద్ధపు హామీలతో గద్దెనెక్కేందుకు చంద్రబాబు నాయకత్వంలో మాయా కూటమి వస్తుందని.. దానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు చిరునామా నియోజకవర్గంలో ఎక్కడో చెప్పాలని అదీప్‌రాజ్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఒక్కో పార్టీ, ఒక్కో నియోజకవర్గానికి వలసలు వెళ్లే నాయకులు పెందుర్తి నియోజకవర్గ ప్రజలకు అవసరం లేదన్నారు. 'మీకు మా పాలనలో మంచి జరిగితేనే మాకు ఓటు వేయండి'అని సగర్వంగా చెప్పుకునే నిఖార్సయిన పాలకుడు వైఎస్ జగన్ సారథ్యంలో తాము పని చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. వేపగుంట, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, పాపయ్యరాజుపాలెం, సుజాతనగర్, చినముషిడివాడ, పెందుర్తి జూనియర్ కళాశాల, పెందుర్తి పాత ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా పెందుర్తి కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. 'జై జగన్.. జై అదీప్‌రాజ్'నినాదాలతో బీఆర్‌టీఎస్ రహదారి మార్మోగింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరాం, కార్పొరేటర్ ముమ్మన దేముడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవి సాంబ, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు శరగడం నరసింహమూర్తి, పార్టీ నేతలు గండి రవికుమార్, అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఆదిరెడ్డి మురళి, యతిరాజుల నాగేశ్వరరావు, ఉప్పిలి కనకరాజు, మెంటి మహేష్, గంట్రెడ్డి మహాలక్ష్మీనాయుడు, గొరపల్లి సాంబ, బల్ల రాంబాబు, గొరపల్లి శ్రీను, చందు యాదవ్, బోకం రామునాయుడు, ఇల్లపు ప్రసాద్, దాసరి సత్తిబాబు, కిల్లి అప్పారావు, సారిపల్లి గణేష్, ముదపాక శివ, బొడ్డు సూర్యప్రకాష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



వాడచీపురుపల్లిలో పరీక్షల కోసం బెంచీలు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పరిధి అడవివరంలోని పలు పాఠశాలల్లో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. అడవివరంలోని ఏపీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో 280 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణ తెలిపారు. మొత్తం 12 గదులు పరీక్షల కోసం కేటాయించినట్లు తెలిపారు. అలాగే సింహాచలం దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు చీఫ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ తెలిపారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 237 మంది పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు.

పరవాడ: మండలంలో పదో తరగతి పరీక్షల కోసం 6 కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,266 మంది, ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న 45 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరవాడ హైస్కూల్‌లో 230 మంది, బాలికల హైస్కూల్‌లో 240 మంది, పెదముషిడివాడ హైస్కూల్‌లో 212 మంది, లంకెలపాలెం హైస్కూల్‌లో 227 మంది, వాడచీపురుపల్లి హైస్కూల్‌లో 231 మంది, పరవాడ సుమేధ పాఠశాలలో 171 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎంఈవో దివాకర్‌రావు చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించమన్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న దాడి కన్నంనాయుడు తదితరులు

సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలో కొలువైన శ్రీముత్యాలమ్మ పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పోటీలను ఉత్సవ కమిటీ సభ్యుడు దాడి కన్నంనాయుడు టాస్ వేసి ఆదివారం ప్రారంభించారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ.40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేలతోపాటు జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న జరగనున్న అమ్మవారి పండగ మహోత్సవం వరకూ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 40 జట్లు పాల్గొంటున్నాయి. పాల సొసైటీ అధ్యక్షుడు దొడ్డి సోమేశ్వరరావు, శిలపరశెట్టి మాలినాయుడు, దొడ్డి రాజకోటి, దొడ్డి వీర అప్పారావు, ఆదారి వెంకటరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ ఆలయం ప్రారంభం





ప్రతిష్ఠించిన శ్రీకృష్ణ భగవానుని విగ్రహం, స్వామివారి సన్నిధిలో అదీప్‌రాజ్, తదితరులు

సబ్బవరం : మండలంలోని రాయపుర అగ్రహారంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయం ఆదివారం వైభవంగా ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణతో యంత్ర స్థాపన, శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి మండపారాధన, హోమాలతోపాటు పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో పాటు ఆలయ ధర్మకర్త నక్కెళ్ల అచ్చిబాబు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా కోలాటం పోటీల్లో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీల్లో పాల్గొన్న వారిని నిర్వాహకులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సాయంత్రం నిర్వహించిన ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారిని వైఎస్సార్ సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, శిరీష దంపతులు, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు దర్శించుకున్నారు.

నేటి నుంచి స్పెషల్ యోగా థెరపీ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రత్యేక యోగా థెరపీ తరగతులు నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా భారత్ నివేష్ మారథాన్



బీచ్ రోడ్డులో మారథాన్ ప్రారంభిస్తున్న సెబీ, ఏఎంఎఫ్‌ఐ అధికారులు

ఆరిలోవ: అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇండియా(ఏఎంఎఫ్‌ఐ), సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ) సంయుక్తంగా ఆదివారం బీచ్‌రోడ్డులో భారత్ నివేష్ మారథాన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ మారథాన్‌ను ఆర్‌కే బీచ్ వద్ద సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రామ్‌మోహన్ రావు, ఏఎంఎఫ్‌ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట చలసాని, నేవల్ ఈస్టర్న్ కమాండ్ రీపిట్ ఆఫీసర్ ఎస్.సబేశన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల అధికారులు మాట్లాడుతూ సమాజంలో విద్య, ఆరోగ్యానికి పెరుగుతున్న ప్రాధాన్యత గురించి వివరించారు. సామాజిక శ్రేయస్సును పెంపొందించడంలో పెట్టుబడిదారులు ముందుండాలన్నారు. విశాఖపట్నం ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మారథాన్‌లో అధిక సంఖ్యలో యువత, ఆయా సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్, తదితరులు ఈ పూజ చేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



నిత్య కల్యాణం తిలకిస్తున్న ఉభయదాతలు

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత



జూలో పిచ్చుకుల కోసం ధాన్యం కంకులతో క్యూరేటర్ నందనీ సలారియా, హరిత వికాస్ ఫౌండేషన్ సభ్యులు



చెట్టుకు ధాన్యం కంకులు కడుతున్న బాలిక

ఆరిలోవ: ప్రకృతిలో పిచ్చుకలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా వుందని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూ సందర్శకులకు పిచ్చుకలపై అవగాహన కల్పించారు. అనంతరం జూలో పలు చోట్ల చెట్లకు పిచ్చుకల ఆహారం కోసం ధాన్యం కంకులు కట్టారు. ఈ సందర్భంగా క్యూరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో పరిస్థితుల వల్ల పిచ్చుకల జాతి అంతరించిపోతుందన్నారు. అక్కడక్కడా కనిపించే వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందన్నారు. ప్రకృతిలో అన్ని జాతుల జీవులను రక్షించుకుని జీవ వైవిద్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ పాలవలస గోపాలనాయుడు, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది, హరిత వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'మహనీయుల త్యాగం వృథా కానివ్వం'



1130వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరో మహనీయుల త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనివ్వబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1130వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులతో పాటు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు విశాఖ ఉక్కును గురించి పోరాడుతున్నా ప్రధాని నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్ విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. లక్షల మందికి ప్రత్యక్షంగా, మరెంతో మందికి పరోక్షంగా ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఫీజు కడితేనే హాల్ టికెట్

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం ఫీజు బకాయిలు పేరిట పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు. పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రోజు విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురిచేయగా.. ఇదేం పని ×నారాయణ× అంటూ తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం స్కూల్‌కు వెళ్లినా, ఫీజు కడితేనే హాల్ టికెట్ ఇస్తామంటూ ఆ పాఠశాల నిర్వాహకులు చెప్పటంతో విద్యార్థి తండ్రి ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇది తీవ్ర చర్చనీయాంశమైంది. ఫీజుబకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాల్సిందేనని డీఈవో చంద్రకళ ఆదేశించినా, ఎన్‌ఏడీలోని సదరు కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై గోపాలపట్నం ఎంఈవో సోమేశ్వరరావును వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారణ జరిపి, నిజమైతే సదరు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్ కోర్సు, హోటల్ మేనేజ్‌మెంట్ (ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్ల వయసు గల పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు 91219 99654, 79930 11605 నంబర్లకు ఫోన్ చేసి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ద్వారకానగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్ నందు గల హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు నేటి నుంచి ఈఎస్‌ఐ క్యాంప్‌లు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ఈఎస్‌ఐకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 18 నుంచి 28 వరకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక కార్యదర్శి గొలగాని అప్పారావు తెలిపారు. ఈ శిబిరాలు జోన్‌లోని వివిధ వార్డు కార్యాలయాలు, సచివాలయాలు సహా గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్దేశిత తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ శిబిరాల్లో కార్మికులకు సంబంధించిన ఈఎస్‌ఐ కార్డులతో ఆధార్ అనుసంధానం, కుటుంబ సభ్యుల వివరాలు అప్‌డేట్ చేయడం వంటి సేవలను పొందవచ్చన్నారు. ఈఎస్‌ఐ సౌకర్యం లేనివారికి కొత్త కార్డులను ఇచ్చేందుకు కూడా ఈ శిబిరాల్లో వివరాలను నమోదు చేస్తారన్నారు. వివరాల కోసం యూనియన్ నాయకులను సంప్రదించాలని కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని, తగదాలు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లు, పాత నేరస్తులకు సీఐ.విజయకుమార్ కౌన్సెలింగ్ చేశారు. ఎన్నికల వేళ జాగ్రత్తగా ఉండాలని, హద్దు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ వెంకటరావు పాల్గొన్నారు.

నేరాల జోలికి పోవద్దు

మర్రిపాలెం: ఫిఫ్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అదుపులో సెల్‌ఫోన్ దొంగ



యువకుడిని స్టేషన్‌కు తరలిస్తున్న కానిస్టేబుల్

విశాఖ విద్య: ఎన్‌ఏడీ మర్రిపాలెం రైతు బజార్‌లో ఆదివారం ఓ యువకుడు సెల్‌ఫోన్ చోరీకి ప్రయత్నించాడు. రైతు బజార్‌కు కూరగాయలు కొనుగోలుకు వచ్చిన ఓ వినియోగదారుడి జేబులోంచి సెల్‌ఫోన్‌ను చోరీ చేసేందుకు యత్నించాడు. దీన్ని గమనించిన సదరు వినియోగదారులు వెంటనే అతన్ని పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న రైతు బజార్ ఈవో కొమ్మనాపల్లి వరహాలు అక్కడికి చేరుకొని ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుబజార్‌కు చేరుకున్న పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని, స్టేషన్‌కు తరలించారు.